క్లుప్తంగా

మంత్రిని కలిసిన నాయకులు



వీర్నపల్లి: మండల కాంగ్రెస్ నాయకుడు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంగగర్‌లో ఆదివారం కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వీర్నపల్లి మండలానికి రావాలని ఆహ్వానం పలకగా.. త్వరలోనే వస్తానని హామీ ఇచ్చారని అన్నారు. నాయకులు శ్రీనివాస్, రవీందర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నేడు గాంధీ, శివాజీ విగ్రహాల ఆవిష్కరణ

బోయినపల్లి: నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ, మహాత్మాగాంధీ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి ఆదివారం తెలిపారు.

స్థానిక హమాలీలకే పనివ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

బోయినపల్లి: ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆయా గ్రామాల్లో ఉన్న స్థానిక హమాలీలకే పని కల్పించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. నీలోజిపల్లి గ్రామంలో హమాలీ కార్మికులతో కలిసి ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. గతంలో కొనుగోలు కేంద్రాల్లో బిహార్ వలస కార్మికులకు పని కల్పించి స్థానిక హమాలీల పొట్ట కొట్టారని ఆరోపించారు. ఈ యాసంగి సీజన్‌లో అలా జరుగకుండా చూసి స్థానిక మమాలీలకే ప్యాడీ సెంటర్లలో పని కల్పించాలని కోరారు. హమాలీ సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి శంకర్, అనుముల రవి, ఆవుల రాములు, పెంతల రాజమల్లు, మల్లయ్య, వెంకటరెడ్డి, కొనుకటి నాగరాజు, ఎర్ర నాంపెల్లి తదితరులున్నారు.

శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఇటీవల నిర్మాణం పూర్తి చేసుకున్న శ్మశానవాటికలకు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేసినట్లు మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు తెలిపారు. విద్యుత్ కనెక్షన్లు, నీటి సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందజేశామన్నారు. అంబేడ్కర్, గౌడ సంఘాలకు ప్రత్యేకంగా శ్మశానవాటికల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామని తెలిపారు.

పీడీగా రుద్రంగి వాసి ఎంపిక

రుద్రంగి: గురుకుల మైనారిటీ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పీడీగా రుద్రంగి వాసి ఎంపికయ్యారు. గతేడాది ఆగస్టులో నిర్వహించి ఇటీవల విడుదల చేసిన గురుకుల టీచర్ పోటీ పరీక్షలో ప్రతిభ కనబర్చిన రుద్రంగి మండల కేంద్రానికి చెందిన లింగంపెల్లి రవి రాజన్న జోన్(3 జోన్)లో పీడీ టీచర్ పోస్టును దక్కించుకున్నారు. నిరుపేద రజక కుటుంబానికి చెందిన రవి కష్టపడి చదివి గురుకుల టీచర్‌గా ఎంపిక కావడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేసి రవికి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రవి అన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభించిన ఎస్సై



తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ గ్రామంలో క్రికెట్ పోటీలను ఆదివారం తంగళ్లపల్లి ఎస్సై దాస సుధాకర్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్నిస్తాయని.. గెలుపోటములకు అతీతంగా క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మిగిలిన అన్నం పేదలకు..

వేములవాడ: పెళ్లిలు, శుభకార్యాల్లో మిగిలిన అన్నాన్ని మై వేములవాడ ట్రస్టు సభ్యులు ఆదివారం సాయంత్రం రాజన్న గుడి ఆవరణలో భక్తులు, పేదలకు వడ్డించారు. ఓ ఆటోలో తీసుకొచ్చి పంచారు. ట్రస్టు ప్రతినిధులు ప్రశాంత్, స్వరూప్, వినయ్, మోహన్, వంశీ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కలగానే కళాశాల ప్రహరీ నిర్మాణం



ప్రహరీ లేని మైదానం



మంత్రి ఆవిష్కరించిన శిలాఫలకం(ఫైల్)

- 2016లో హామీ ఇచ్చిన డిప్యూటీ సీఎం
- నేటికీ విద్యార్థులకు తప్పని తిప్పలు

కోనరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గోడ నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. అప్పటి మంత్రి వచ్చి హామీ ఇచ్చిన పనులకు ఏడు సంవత్సరాలు గడుస్తున్నా అతీగతీ లేకుండా పోయింది. ఏడేళ్లుగా పడుతున్న ఇబ్బందులు అలాగే ఉంటున్నాయి. పదోతరగతి వరకే పరిమితమైన కోనరావుపేట మండల విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోకూడదన్న ఉద్దేశంతో అప్పటి నాయకుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డితో మాట్లాడి మారుమూల ప్రాంతానికి జూనియర్ కళాశాలను తెచ్చారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడగా.. కోనరావుపేట కళాశాలకు రూ.130లక్షలు మంజూరయ్యాయి.

కడియం పర్యటన

కోనరావుపేట మండల కేంద్రంలో 2016 అక్టోబర్ 20న విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అప్పటి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కోనరావుపేట కళాశాలకు గోడ నిర్మించాలని, ముందున్న తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల శిథిలాలను వారం రోజుల్లోగా తొలగించాలని ఆదేశించారు. అప్పటి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు అంచనాలు తయారు చేసి పంపించడంలో నిర్లక్ష్యం చేశారు. ప్రజలు, విద్యార్థుల ఆందోళనతో కార్యాలయాల శిథిలాలలను మాత్రం తొలగించారు.

మైదానమే క్రీడాప్రాంగణం

కోనరావుపేట ప్రభుత్వ కళాశాల ముందు మైదానం ఉంది. మోడల్ స్కూల్, కళాశాలకు ఇదే మైదానం. ఇది విద్యార్థులకు పూర్తిస్థాయిలో సరిపోకున్నా దీంతోనే సర్దుకుపోతున్నారు. ప్రస్తుతం తెలంగాణ క్రీడాప్రాంగణాన్ని కూడా ఇందులోనే ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన పరికరాలను బిగించారు. దీంతో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోంది.

హామీ ఇచ్చి నెరవేర్చలేదు



కోనరావుపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ సమస్య నెరవేరని హామీగానే మిగిలిపోతోంది. ఆవరణలోకి పశువులు, మేకలు వస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన హామీ నెరవేరలేదు. విద్యార్థుల సమస్యలు తొలగలేదు. కళాశాలను తీసుకొచ్చిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో మాట్లాడి ప్రహరీ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

– రాస రవీందర్‌రెడ్డి, కోనరావుపేట

బీసీల కుల గణన అభినందనీయం



మాట్లాడుతున్న వెంకటస్వామి

వేములవాడ: సమాజంలో వెనుకబడిన తరగతులను గుర్తించడానికి, వారి వెనుకబాటుతనాన్ని రూపుమాపడానికి, అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడటం అభినందనీయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనాభా దమాషాలో రిజర్వేషన్లు పెంచడానికి వెనుకబడిన తరగతుల సమకాలిన అంశాల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందని, దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులు కలిసి బీసీల అభ్యున్నతికి ఒక సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకున్నారని, బీసీ సమాజంలో కాంగ్రెస్ పార్టీకి మంచి గుర్తింపు వస్తుందన్నారు. గత ప్రభుత్వాలు బీసీ కులగణనను పట్టించుకోలేదని, కులగణన చేయడం వలన వెనుకబడిన, నిర్లక్ష్యానికి గురైన, అట్టడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేశ్, నాయకులు కూరగాయల కొమురయ్య, వనపర్తి శంకర్ ఉన్నారు.

బీసీల ఆశలు నెరవేరుస్తున్న సర్కారు



మాట్లాడుతున్న పర్శహన్మాండ్లు

సిరిసిల్లటౌన్: వెనుకబడిన వర్గాల చిరకాల వాంఛను కాంగ్రెస్ సర్కారు నెరవేర్చుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మాండ్లు అన్నారు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు బీసీల డిమాండ్ పట్టింపు లేకుండా ఉన్నాయని, తద్వారా బీసీలకు రాజకీయంగా సంక్రమించాల్సిన హక్కులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గోనె ఎల్లప్ప, తడుక కమలాకర్, సామల తిరుపతి, నల్ల శ్రీకాంత్, గాజుల సాగర్, అన్నల్‌దాసు భాను, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ తీర్మానంపై హర్షం

సిరిసిల్లఎడ్యుకేషన్: బీసీ కుల గణనపై శాసనసభ ఏకగ్రీవ తీర్మానం పొందడం హర్షణీయమని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వీడ్కోలు హంగామా



సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు పార్టీ ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ ఉదయ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. ఇష్టపడి చదివినప్పుడే పరీక్షలు కష్టం లేకుండా రాసి ఉన్నత స్థాయిలో రాణిస్తారని అన్నారు. విద్యార్థుల ఆటాపాట అలరించాయి. రిటైర్డ్ డీఐఈవో రాంచంద్రం, ప్రిన్సిపాల్ విజయ రఘునందన్, అధ్యాపకులు వివేకానంద, వెంకటేశం, దేవయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం సిగ్గుచేటు



రంగనాయక సాగర్ కాలువ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వంలో తామే ఉన్నామనే సంగతి మరిచి ప్రతిపక్షాలపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మాట్ల మధు విమర్శించారు. గతంలో అప్పటి మంత్రి కేటీఆర్ నీటిని విడుదల చేసిన జిల్లెల్ల గ్రామ శివారులోని రంగనాయకసాగర్ కాలువను ఆదివారం రైతులతో కలిసి సందర్శించారు. ఇక్కడి రైతుల కోసం శ్రమించి నీళ్లు తెచ్చిన వ్యక్తి కేటీఆర్ అని కొనియాడారు. కేటీఆర్‌పై శనివారం విమర్శలు చేసిన కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డిపై మండిపడ్డారు. గతంలో కేటీఆర్ నీటిని విడుదల చేసిన ఫొటోలను ప్రదర్శించి నిరసన తెలిపారు. ఆరు గ్యారంటీల అమలుపై దృష్టిపెట్టాలని హితువు పలికారు. మాజీ సర్పంచ్ కొయ్యడ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు కొమ్మిటి రాజిరెడ్డి, సతీష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అబ్బాడి అనిల్‌రెడ్డి, సిలివేరి చిరంజీవి, భాస్కర్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, సత్తిరెడ్డి, నరేందర్‌రెడ్డి, అఫ్రోజ్, రవి, మల్లయ్య, లక్ష్మీనారాయణ, దేవరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వం



అజయ్‌కి కండువా కప్పుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: ప్రజాసంక్షేమమే ప్రధాన ఎజెండాగా పని చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఆయనకు ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఒకే కుటుంబం ఇష్టారాజ్యంగా పాలించి అప్పులపాలు చేసిందని, ప్రస్తుతం ప్రజలెంతో విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారన్నారు. ప్రజల సంక్షేమం కోసమే తమ పార్టీ పని చేస్తుందని అన్నారు. ఇప్పపూల అజయ్ మాట్లాడుతూ.. తాను పదేళ్లుగా కౌన్సిలర్‌గా వార్డు ప్రజలకు సేవలందించానని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో తాను భాగస్వామినయ్యేందుకు పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ బింగి మహేశ్, నాయకులు సంగ స్వామి, సుమంత్ రెడ్డి, వంగల శ్రీనివాస్, సాగారం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, కూరగాయల కొముర‌య్య, చిలుక రమేశ్, పుల్కం రాజు, కనికరపు రాకేశ్, ఇప్పపూల వినోద్, పాత సత్యలక్ష్మి, తోట లహరి, లింగంపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి



గేటు ముందు బైఠాయించిన కాలనీవాసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ మండెపల్లి డబుల్ బెడ్‌రూం కేసీఆర్‌నగర్ కాలనీవాసులు ఆదివారం ధర్నా నిర్వహించారు. కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూం సముదాయం గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏడాదిన్నర కాలంగా డబుల్ బెడ్‌రూంలలో నివసిస్తున్నామని, ఇప్పటివరకు శ్మశానవాటికకు స్థలం కేటాయించలేదని ఆరోపించారు. కాలనీలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు నిర్వహించేందుకు పక్క గ్రామాల వారిని వేడుకోవాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి కాలనీవాసులకు ఇబ్బంది కలగకుండా అనువైన చోట శ్మశానవాటిక ఏర్పాటుకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేములవాడఅర్బన్: రుద్రవరం గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని 2003- 2004 సంవత్సరం పదోతరగతి విద్యార్థులు నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు.

రెండు దశాబ్దాల తర్వాత..



ముస్తాబాద్: రెండు దశాబ్దాల అనంతరం పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. వెన్నెల పాఠశాలకు చెందిన 2001-02 ఎస్సెస్సీ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. ఆరుట్ల తిరుపతిరెడ్డి, హమీద్, మహేందర్‌రెడ్డి, యాదగిరి, రాఘవేందర్‌రెడ్డి, ఎద్దండి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వీర్నపల్లి: వీర్నపల్లి-ఎల్లారెడ్డిపేట ప్రధాన రహదారి గుంటపల్లి చెరువు మలుపు సమీపంలో గతంలో కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు దగ్గర ఉన్న మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డు కోతకు గురై ప్రమాదాలు జరుగుతున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రధాన రహదారిలో ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు.

పుస్తె మెట్టెల పంపిణీ



బోయినపల్లి: విలాసాగర్ గ్రామానికి చెందిన పాడి రైతు పోలె రాజు కూతురు సంధ్య వివాహానికి ఆదివారం కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో ఉచితంగా పుస్తె మెట్టెలు పంపిణీ చేశారు. రాజు విలాసాగర్ పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యుడు కావడంతో పుస్తె మెట్టెలు అందించారు. సొసైటీ చైర్మన్ ఎం.సంతుప్రకాశ్‌రెడ్డి, సూపర్‌వైజర్ కమలాకర్, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం



వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ద్వారా వెయ్యి రోజులుగా పేదలకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి వేములవాడకు చెందిన గణాచారి మఠం శైలజ–సాంబశివుడు దంపతులు చేయూతనందించారు. రూ.50వేల విరాళాన్ని ఆదివారం ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, గొంగళ్ల రవికుమార్, బస్మంగి బసవరాజుకు అందజేశారు.

నల్లగొండ ఉత్సవ కమిటీలో మండలవాసులు

బోయినపల్లి(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉత్సవ కమిటీని 13 మందితో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ప్రకటించారు. కమిటీలో మండలంలోని కోరెం గ్రామానికి చెందిన వన్నెల రమణారెడ్డి, మర్లపేట గ్రామానికి చెందిన భీంరెడ్డి మహేశ్‌రెడ్డికి చోటు లభించింది.

పోచమ్మ ఆలయానికి విరాళం అందజేత

కోనరావుపేట: కొలనూర్ గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి సంకినేని సందీప్‌రావు రూ.20,116, సంకినేని మధుసూదన్‌రావు రూ.11,151, శ్రీలక్ష్మీర్సింహస్వామి నాయీబ్రాహ్మణ సేవాసంఘం రూ.5,021 అందజేశారు.

ఘనంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో శ్రీఆంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభించారు. రూ.50లక్షల భారీ వ్యయంతో ఆలయ నిర్మాణాన్ని ఇటీవల పూర్తి చేశారు. పురాతన ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహంతోపాటు నంది విగ్రహం, గణపతి, నాగరాజు, అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. వేద పండితులు రఘురామశర్మ ఆధ్వర్యంలో పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 22 వరకు ఉత్సవాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మాజీ సర్పంచ్ నిమ్మ లక్ష్మి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ అపెరా సుల్తానా, ఆలయ కమిటీ సభ్యులు నిమ్మ సుధాకర్ రెడ్డి, లింగాల నర్సయ్య, కిషన్‌రెడ్డి, హన్మాన్, సూర నర్సయ్య, డీటీ ఎలుసాని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయ వార్షిక వేడుకలు

ఎల్లారెడ్డిపేట: కిషన్‌దాస్‌పేటలోని శ్రీఆంజనేయస్వామి ఆలయ 16వ వార్షిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి చందనాభిషేకం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు గంప నాగేంద్రం, పద్మ దంపతులు వేడుకలను నిర్వహిస్తున్నారు. పూజల అనంతరం తీర్థప్రసాద, అన్నప్రసాద వితరణ చేశారు. అర్చకుడు ఉమాశంకర్, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు, చెన్న సత్యనారాయణ, తోట వేణు, నగుబోతు రాము, శ్రీనివాస్, సిద్ధి రాములు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం కరువు



కోనరావుపేట: సుద్దాలలో పారిశుధ్యం పనులు కరువయ్యాయి. ప్రధాన వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉంటూ దుర్గంధం వ్యాపిస్తోంది. సుద్దాలలోని ప్రధాన రహదారికిరువైపులా మురుగు కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్లలోని మురుగు నీరంతా రోడ్డు పక్కనే నిల్వ ఉంటోంది. అందులో దోమలు పెరిగి చుట్టుపక్కల ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులు అందులోనే ఉన్నాయని, అధికారులు స్పందించి మురుగు కాలువ నిర్మించాలని కోరుతున్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా శేఖర్

సిరిసిల్లఎడ్యుకేషన్/సిరిసిల్లటౌన్: యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా కాదాసు శేఖర్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ ఉత్తర్వులందించారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జులు సురభి ద్వివేది, రమేశ్‌బాబు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆదేశానుసారం ఈ నియామకం జరిగిందని వెల్లడించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిమల్ల భాను, రాష్ట్ర నాయకుడు గుడిసె ప్రభాకర్, అసెంబ్లీ సెక్రటరీ అకేని సతీష్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, కదాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గాలు ఎన్నిక



ఇల్లంతకుంట విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల, గ్రామ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం నూతన కార్యవర్గాలను ఆదివారం ఏకగ్రీకంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా దేశరాజు తిరుపతి, ఉపాధ్యక్షులుగా తిప్పరపు శ్రీనివాస్, కొడిముంజ రవి, ప్రధాన కార్యదర్శిగా కొడిముంజ తిరుపతి, కోశాధికారిగా తిప్పారపు సురేష్‌కుమార్, సహాయక కార్యదర్శిగా కొత్తపల్లి విఠల్, సలహాదారులుగా తిప్పారపు హన్మండ్లు, మొగొలాజు వెంకటచారి ఏకగ్రీవమయ్యారు. ఇల్లంతకుంట గ్రామ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడిగా తిప్పారపు స్వామి, ఉపాధ్యక్షులుగా తిప్పారపు నాగరాజు, లంకోజు చంద్రం, ప్రధాన కార్యదర్శిగా నాగసముద్రాల రాజు, కోశాధికారిగా రాంపెల్లి రమేశ్, సహాయ కార్యదర్శిగా తిప్పారపు సతీష్, ముఖ్య సలహాదారులుగా నాగసముద్రాల నర్సింహచారి, తిప్పారపు శ్రీనివాస్ ఏకగ్రీవమయ్యారు. మాజీ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు సంతోష్, వెలిచాల రాజేశం, చందనం చంద్రమౌళి, రాజశేఖర్, కిషన్, శ్రీనివాస్, బ్రహ్మయ్య, రవి, రాజమౌళి, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.